లోక్‌అదాలత్‌తోనే కేసుల తక్షణ పరిష్కారం

ఎంఆర్.సునీత, జిల్లా ప్రధాన న్యాయమూర్తి



వనపర్తిలో కక్షిదారులతో మాట్లాడుతున్న ఎంఆర్.సునీత

వనపర్తి న్యూటౌన్, న్యూస్‌టుడే: లోక్‌అదాలత్‌తోనే కక్షిదారులకు తక్షణ కేసుల ఉచిత పరిష్కారం వంటి ప్రయోజనాలుంటాయని జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎంఆర్.సునీత అన్నారు. శనివారం జిల్లా కోర్టు ప్రాంగణంలో న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో లోక్‌అదాలత్‌తో పాటు ప్రపంచ డెఫ్‌డే(వినికిడి లోపం) కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్య శిబిరంలో కోర్టు న్యాయమూర్తులు, న్యాయవాదులు, సిబ్బంది, కక్షిదారులకు ఉచిత వైద్యంతో పాటు వినికిడి లోపం పరీక్షలు నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ.. సివిల్ కేసులతో పాటు రాజీ చేయదగిన క్రిమినల్ కేసులను సామరస్య పూర్వకంగా, వేగవంతంగా లోక్‌అదాలత్‌లో పరిష్కారమవుతాయని వివరించారు. కుటుంబ, ఆర్థిక వివాహ సంబంధ కేసులను ప్రధానంగా పరిష్కరిస్తామని వివరించారు. సివిల్ కోర్టులు ఇచ్చే తీర్పులకు సమానంగా లోక్ అదాలత్ తీర్పులుంటాయన్నారు. ఈ తీర్పులకు అప్పీలు కూడా ఉండదన్నారు. దీంతో కక్షిదారుల్లో మనస్పార్థాలు, గొడవలకు ఆస్కారం ఉండదన్నారు. పలు కేసులకు సంబంధించిన రాజీపత్రాలు బ్యాంకు అధికారులకు అందించారు. జిల్లా వ్యాప్తంగా లోక్‌అదాలత్‌లో 2944 కేసులు రాజీమార్గం ద్వారా పరిష్కారమైనట్లు కోర్టు సిబ్బంది తెలిపారు. కార్యక్రమంలో న్యాయమూర్తులు రజని, రవికుమార్, జానకి, శ్రీలత, న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు మోహన్‌కుమార్‌యాదవ్, ఉపాధ్యక్షుడు కృష్ణయ్య, నాయకులు బాలనాగయ్య, ఉత్తరయ్య, పలువురు వైద్య సిబ్బంది, కోర్టు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు, యువతే ప్రచార తారలు

యువ క్లబ్‌ల ద్వారా పాలమూరు పర్యాటకంపై దృష్టి ● ఉమ్మడి జిల్లాలో ఇప్పటికే 1,397 ఏర్పాటు

మహబూబ్‌నగర్ సమీపంలో పిల్లలమర్రికి ఎన్నో ఏళ్ల చరిత్ర ఉంది. ఈ మహావృక్షం ఊడలు ఎక్కడ మొదలయ్యాయో ఎవరూ కనుక్కోలేకపోయారు. దేశంలోనే ప్రసిద్ధి పొందిన పిల్లలమర్రి గురించి నేటి తరానికి తెలిసింది తక్కువే. ప్రధానంగా విద్యార్థులు, యువతకు పిల్లలమర్రి ప్రాముఖ్యత తెలియదు. మన ప్రాంతంలోనే ఉన్న దీని ప్రాముఖ్యతను తెలుసుకుని భవిష్యత్తు తరాలకు తీసుకెళ్లే బాధ్యతను జిల్లాలోని విద్యార్థులు, యువకులు తీసుకోనున్నారు.



నల్లమల అంటే అడవులే కాదు. కృష్ణా నది అందాలు.. అభయారణ్యం.. పులులు, ఇతర జంతువులు.. ఆధ్యాత్మిక కేంద్రాలు.. ప్రకృతి రమణీయత.. ఇలా సమ్మేళనంగా ఉన్న నల్లమల గురించి పూర్తి స్థాయి అవగాహన నేటి తరానికి అవసరం. ఇక్కడి పర్యాటక విశేషాలను ఇతరులకు అందించాలి. అలా జరగాలంటే ఆ బాధ్యత స్థానిక విద్యార్థులు, యువతపైనే ఉంది.



ఈనాడు, మహబూబ్‌నగర్: రాష్ట్ర పర్యాటక శాఖ సమన్వయంతో కేంద్ర పర్యాటక శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేస్తున్న యువ టూరిజం క్లబ్‌ల(వైటీసీ) స్థానిక విద్యార్థులు, యువతను కొత్త ఆలోచనల వైపు నడిపించనున్నాయి. ఇప్పటికే ఉమ్మడి జిల్లాలో మొత్తం 1,397 వైటీసీలను ఏర్పాటు చేశారు. వీటిలో మొత్తం 34,925 మంది విద్యార్థులు, యువకులు భాగస్వామ్యం కానున్నారు. కేవలం మహబూబ్‌నగర్ జిల్లాలోనే 1,317 క్లబ్‌లు ఏర్పాటు చేశారు. మిగతా నాలుగు జిల్లాల్లో ప్రస్తుతం ఉన్న క్లబ్‌లను పెంచడానికి అధికారులు కసరత్తు ప్రారంభించారు.

బాధ్యత వీరిదే..: నంద వంశం నుంచి అసఫ్ జాహీ వంశం వరకు 22 ప్రముఖ రాజవంశాలు ఈ ప్రాంతాన్ని పాలించాయి. హరిహర, శక్తి కేంద్రాలకు పాలమూరు ఎంతో ప్రసిద్ధి. ముస్లింలు పవిత్రంగా భావించుకునే దర్గాలకు కొదవలేదు. కృష్ణా, తుంగభద్ర నదులు ఇక్కడి నుంచే ప్రవహిస్తాయి. నల్లమల ప్రకృతి సౌందర్యం ఇట్టే కట్టిపడేస్తాయి. వనపర్తి, గద్వాల, కొల్లాపూర్, ఆత్మకూరు, గోపాలపేట సంస్థానాలకు గుర్తింపు ఉంది. పూర్వ మహబూబ్‌నగర్ జిల్లాలో మొత్తం 34 ప్రాంతాలను వారసత్వ, చారిత్రక, ఆధ్యాత్మిక కేంద్రాలను పర్యాటకశాఖ గుర్తించింది. ఈ సంపదను కాపాడటం, పర్యాటక రంగాన్ని ప్రోత్సహించడానికి ఈ యువ టూరిజం క్లబ్‌లు పని చేయనున్నాయి.

ఒక్కో క్లబ్‌లో 25 మంది..: ఈ క్లబ్‌ల ఏర్పాటు ద్వారా స్థానిక విద్యార్థులు, యువతకు పర్యాటక ప్రాముఖ్యతపై పూర్తిస్థాయి అవగాహన కల్పించనున్నారు. మొదటి దశలో క్లబ్ ఏర్పాటు, రెండో దశలో పర్యాటకంపై వివిధ దశల్లో పోటీలు నిర్వహించనున్నారు. మూడో దశలో ఈ క్లబ్‌ల క్షేత్రస్థాయికి వెళ్లి సంస్కృతి, సంప్రదాయాలకు పర్యాటక రంగాలు ఎలా ఉపయోగపడతాయి? వీటి పరిరక్షణ ఎలా చేయాలి? వంటి వాటిపై దృష్టి పెడతారు. పాఠశాలలు, కళాశాలలు, విశ్వవిద్యాలయాల స్థాయిలో ఒక్కో క్లబ్‌ను 25 మందితో ఏర్పాటు చేస్తున్నారు. ప్రతి క్లబ్‌కు అందులోని విద్యార్థి నాయకుడిగా, ఆ విద్యాలయంలో పని చేసే ఉపాధ్యాయుడు సమన్వయకర్తగా వ్యవహరించనున్నారు. దీనిపై మహబూబ్‌నగర్ పర్యాటకశాఖ అధికారి వెంకటేశ్వర్లు 'ఈనాడు'తో మాట్లాడుతూ ఈ క్లబ్‌ల ఏర్పాటుతో పాలమూరు పర్యాటకానికి మరింత గుర్తింపు రావడంతోపాటు విద్యార్థులు, యువతకు వారసత్వ సంపదపై అవగాహన కలుగుతుందన్నారు.

జిల్లా	టూరిజం క్లబ్‌లు	విద్యార్థులు, యువత
మహబూబ్‌నగర్	1,317	32,925
నాగర్‌కర్నూల్	37	925
జోగులాంబ గద్వాల	12	300
నారాయణపేట	19	475
వనపర్తి	12	300

పంచాయతీ ఓటరు తుది జాబితా వచ్చేసింది

● మొత్తం ఓటర్లు 3,67,521

● పురుషుల కన్నా 753 మహిళా ఓటర్లే అధికం



వనపర్తి న్యూటౌన్, న్యూస్‌టుడే: త్వరలో జరగనున్న స్థానిక ఎన్నికలకు సంబంధించి ఓటరు తుది జాబితా విడుదల చేశారు. శనివారం డీపీవో కార్యాలయంతో పాటు అన్ని గ్రామపంచాయతీల్లో నోటీసు బోర్డుపై సంబంధితాధికారులు పొందుపర్చారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో ప్రకటించిన తుది జాబితా ప్రకారం పంచాయతీ ఎన్నికలకు ఈ నెల 13న ముసాయిదా ఓటరు జాబితాను రూపొందించారు. జాబితాపై అభ్యంతరాలుంటే గ్రామాల వారీగా ఈ నెల 14 నుంచి 21 వరకు స్వీకరించి తుది జాబితాను ప్రకటించారు. వనపర్తి జిల్లాలో మొత్తం 14 మండలాలుండగా ఆయా మండలాల్లోని 260 గ్రామపంచాయతీల్లో 2366 వార్డులను ఏర్పాటు చేశారు. ఓటరు నమోదు కోసం 1 జనవరి 2025 నాటికి 18 ఏళ్లు నిండిన అవకాశం కల్పించారు. తుది జాబితాలో పురుష ఓటర్లు 1,83,382, మహిళా ఓటర్లు 1,84,135, ఇతరులు 4 కాగా మొత్తం 3,67,521 ఓటర్లు ఉన్నారు. పురుషుల కంటే 753 మంది మహిళా ఓటర్లు అధికంగా ఉన్నారు.

మండలాల వారీగా పురుషుల, మహిళా ఓటర్ల వివరాలు ...

మండలం	గ్రామ పంచాయతీలు	వార్డులు	పురుషులు	మహిళలు	ఇతరులు	మొత్తం
అమరచింత	14	120	6873	6963	-	13836
ఆత్మకూరు	13	118	9756	9724	1	19481
చిన్నంబావి	17	156	12377	12441	-	24818
ఖిల్లాగణపురం	29	248	16698	16526	1	33225
గోపాల్‌పేట	16	152	15172	15490	-	30662
కొత్తకోట	23	208	15505	15753	-	31258
మదనపురం	17	162	11432	11527	-	22959
పాన్‌గల్	28	256	21100	20366	1	41467
పెబ్బేరు	20	182	13721	13866	-	27587
పెద్దమందడి	23	212	15625	16053	-	31678
రేవల్లి	12	110	9266	9176		18442
శ్రీరంగపురం	8	82	7962	8165	-	16127
వనపర్తి	26	230	16167	16535		32702
వీపనగండ్ల	14	130	11728	11550	1	23279
	260	2366	1,83,382	1,84,135	4	3,67,521

పొలాలున్నా.. పంట వేయలేం..!

లోకాయుక్త సభ్యులకు మొర పెట్టుకున్న రైతులు



రాయనిపేట చెరువు వద్ద పరిశీలనలో లోకాయుక్త సభ్యుల బృందం

కొత్తకోట, వనపర్తి గ్రామీణం, న్యూస్‌టుడే: భీమా ప్రాజెక్టు 2వ దశలో ముంపునకు గురైన వ్యవసాయ పొలాలను శనివారం లోకాయుక్త అధికారి విద్యాసాగర్ ఆధ్వర్యంలో సభ్యులు క్షేత్రస్థాయి పరిశీలన చేశారు. కొత్తకోట మండలం రాయనిపేట, వనపర్తి మండలం కడుకుంట్లకు చెందిన రైతులు భీమా ప్రాజెక్టు 15వ ప్యాకేజీలో చెరువులు నింపుతున్న క్రమంలో తమ పొలాలు ఒక పంట హక్కును కోల్పోయామంటూ లోకాయుక్తకు ఫిర్యాదు చేశారు. రాయనిపేటకు చెందిన 196 ఎకరాలు, కడుకుంట్లకు చెందిన సుమారు 300 ఎకరాలు చెరువులను నింపడం(ఎఫ్‌టీఎల్) వల్ల ముంపునకు గురవుతున్నట్లు ఫిర్యాదు చేశారు. భూ యాజమాన్య హక్కులు(పట్టాలు) కలిగిన తాము ఒక్క పంటను కూడా వేయలేకపోతున్నందున పరిహారం ఇవ్వాలంటూ ప్రభుత్వానికి పలుమార్లు విన్నవించినా స్పందనలేకపోవడంతో బాధితులు 2019లో లోకాయుక్తకు ఫిర్యాదు చేశారు. ఈ క్రమంలో లోకాయుక్తలో ఇన్వెస్టిగేషన్ టీం ఈ పర్యటనలో పాల్గొని బాధిత రైతుల ఇబ్బందులను వ్యక్తిగతంగా అడిగి తెలుసుకుంది. సంబంధిత చెరువులు, ముంపునకు గురైన పొలాలను పరిశీలించింది. రైతుల తరపున న్యాయవాది శంకర్‌రెడ్డి అధికారులకు స్థానిక పరిస్థితులు వివరించారు. ఏడాది పొడవునా చెరువుల్లో నీరు ఉండటం వల్ల ఒక్క ఎకరాన్ని సాగు చేసుకోలేకపోతున్నట్లు తెలిపారు. గత పదేళ్లుగా నష్టపోయిన రైతులకు సింగోటం, కోడేరు, పెద్ద కొత్తపల్లి ప్రాంతాల్లో ఎఫ్‌టీఎల్‌లో ఉన్న వ్యవసాయ భూములకు ఎకరాకు రూ.6 లక్షల చొప్పున పరిహారం ఇచ్చారని గుర్తు చేస్తూ వీరంతా పరిహారం కోసం పూర్తి అర్హత కలిగి ఉన్నట్లు తెలిపారు. స్థానిక పరిస్థితులకు క్షుణ్ణంగా పరిశీలించిన అధికారులు నివేదికను సిద్ధం చేసి లోకాయుక్త ముందుంచుతామని తెలిపారు. లోకాయుక్త సభ్యుడు తిరుపతి వెంకట్రావ్, భీమా ఎస్ఈ శ్రీనివాస్‌రెడ్డి, ఆర్డీవో పద్మావతి, కొత్తకోట, వనపర్తి తహసీల్దార్లు, వెంకటేశ్వర్లు, రమేష్‌రెడ్డి, ఎస్సైలు మంజునాథ్‌రెడ్డి, జలంధర్‌రెడ్డి, నిర్వాసిత రైతులు పాల్గొన్నారు.

యువజనోత్సవాల్లో ప్రతిభా పాటవాలు



వనపర్తిలో యువజనోత్సవ పోటీలో నృత్యం చేస్తున్న విద్యార్థినులు

● రాష్ట్ర స్థాయికి 30 మంది విద్యార్థుల ఎంపిక

వనపర్తి న్యూటౌన్, న్యూస్‌టుడే: వనపర్తికి చెందిన యువత పలు రంగాల్లో ప్రతిభ కనబరుస్తున్నారు. ఇటీవల జరిగిన జిల్లా స్థాయి యువజనాత్సవాల్లో వివిధ విభాగాల్లో 30 మంది యువతీ, యువకులు ప్రతిభ చూపి రాష్ట్ర స్థాయికి ఎంపికయ్యారు. ఈ నెల 26న వనపర్తి జిల్లా కేంద్రంలో జానపద నృత్యం, సోలో, గీతాలు, వ్యాసరచన, చిత్రలేఖనం, ఉపన్యాస, ఉత్పత్తులు, వైజ్ఞానిక, బైలాజికల్ తదతర పోటీలను రాష్ట్ర యువజనశాఖ ఆధ్వర్యంలో జరిగాయి. ప్రధానంగా జానపదగేయాలు, నృత్యాలు, పలువురిని ఆకట్టుకున్నాయి. వీరిలో కొంత మంది రాష్ట్రస్థాయికి ఎంపికయ్యారు. ఇక్కడ ప్రతిభ కనబరిస్తే జాతీయ స్థాయికి ఎంపికయ్యే అవకాశం ఉంది. ఒక విభాగంలో 10 మందితో కూడిన బృందం 15 నిమిషాల పాటు ప్రదర్శన చేయాల్సి ఉంటుంది. మరో విభాగంలో 7 నిమిషాల పాటు వ్యక్తిగత ప్రదర్శన ఉంటుంది. ఇందులో అత్యధికంగా ఐదుగురు పాల్గొనే అవకాశముంది.

రెండు పర్యాయాలు రాష్ట్ర స్థాయికి...



వనపర్తిలో ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో బీఎస్సీ తృతీయ సంవత్సరం చదువుతున్నాను. యువజనశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన పోటీల్లో పాల్గొన్నాను. గతేడాది, ప్రస్తుతం జానపద నృత్య బృందానికి నాయకత్వం వహించాను. రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక కావడం ఎంతో సంతోషాన్నిచ్చింది. భవిష్యత్తులో ఉన్నతస్థాయికి ఎదిగి చిన్నారులకు నృత్యంపై శిక్షణ ఇచ్చి వారిని తీర్చిదిద్దుతాను.

...లహరిసాయి, వనపర్తి

సినిమాలు చూసి నృత్యంపై ఆసక్తి



ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో బీఎస్సీ తృతీయ సంవత్సరం చదువుతున్నాను. చిన్నప్పటి నుంచి సినిమాలు, టీవీల్లో కళాకారుల నృత్యాలను చూస్తూ ఆసక్తి పెంచుకొని నేర్చుకున్నాను. రెండేళ్ల కింద నిర్వహించిన పోటీలో రాష్ట్ర స్థాయికి ఎంపికయ్యాను. హైదరాబాదులో నిర్వహించిన పోటీలో పలువురు నృత్యాలను చూసి ఆసక్తి పెరిగింది. గతంలో నృత్యం చేసిన అనుభవాన్ని దృష్టిలో పెట్టుకొని ప్రతిభ కనబరుస్తా. భవిష్యత్తులో డ్యాన్సర్‌గా ఎదగాలన్నదే లక్ష్యం. **స్వాతి, వనపర్తి**

చిన్నప్పటి నుంచి పాటలు పాడాలన్నదే లక్ష్యం



మాది ఉప్పరిపల్లి. మా అన్న పరమేశ్వర్, అక్క అరుణలు పాటలు పాడేవారు. వారిని చూస్తూ చిన్నప్పటి నుంచే పాటలపై ఆసక్తి పెంచుకున్నాను. వనపర్తి మహిళా డిగ్రీ కళాశాలలో బీఏ తృతీయ సంవత్సరం చదువుతున్నాను. గతంలోనూ, ఇటీవల నిర్వహించిన పోటీలోనూ రాష్ట్ర స్థాయికి ఎంపికయ్యాను. భవిష్యత్తులో మంచి గాయకురాలిగా ఎదగాలని లక్ష్యంగా పెట్టుకున్నాను. **మునీశ్వరి, ఉప్పరిపల్లి, ఖిల్లాగణపురం**

1న డీఈఎల్ఈడీ, డీపీఎస్ఈ అభ్యర్థుల ధ్రువపత్రాల పరిశీలన

మహబూబ్‌నగర్ పట్టణం, న్యూస్‌టుడే: డిప్లొమా ఇన్ ఎలమెంట్రీ ఎడ్యుకేషన్ (డీఈఎల్ఈడీ), డిప్లొమా ఇన్ ప్రీ స్కూల్ ఎడ్యుకేషన్ (డీపీఎస్ఈ) 2024-26లో ప్రవేశం పొందిన అభ్యర్థుల ధ్రువపత్రాల పరిశీలనకు హాజరుకావాలని డైట్ కళాశాల ప్రిన్సిపల్ మేరాజుల్లా ఖాన్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. అక్టోబరు 1న ఉదయం 10 గంటలకు ప్రభుత్వ డైట్ కళాశాలలో ప్రవేశం పొందిన అభ్యర్థులు తమ ధ్రువపత్రాలను పరిశీలించుకోవాలని సూచించారు.

మరింత వేగంగా ఆర్టీసీ లాజిస్టిక్స్ సేవలు

వనపర్తి పట్టణం, న్యూస్‌టుడే: వనపర్తి డిపో పరిధిలో టీజీఎస్ ఆర్టీసీ లాజిస్టిక్స్ సేవల ద్వారా అత్యవసర వస్తువులు, సరకుల రవాణాకు ప్రయాణ ప్రాంగణాల్లో బుకింగ్ కౌంటర్లు ఏర్పాటు చేశామని డిపో మేనేజర్ వేణుగోపాల్ తెలిపారు. వనపర్తి, కొత్తకోట, పెబ్బేరు, ఆత్మకూరు, అమరచింత బస్టాండ్లల్లో కార్గో పార్సిల్ ఏజెంట్లను నియమించామన్నారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర, కర్ణాటక రాష్ట్రాలకు సేవలు అందిస్తున్నామని చెప్పారు. డిపో పరిధిలోని ప్రజలు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

ఉమ్మడి జిల్లా ఫుట్‌బాల్ జట్టుకు ఎంపిక



ఎంపికైన విద్యార్థి చరణ్‌కుమార్‌తో ప్రధానోపాధ్యాయుడు విష్ణువర్ధన్‌రెడ్డి, పీఈటీ వెంకట్

ఆత్మకూరు, న్యూస్‌టుడే : ఆత్మకూరు ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలకు చెందిన 8వ తరగతి విద్యార్థి జి.చరణ్ కుమార్ ఉమ్మడి జిల్లా ఫుట్‌బాల్ జట్టుకు ఎంపికయ్యాడు. గద్వాల జిల్లా కేంద్రంలో నిర్వహించిన ఉమ్మడి జిల్లా జట్టు ఎంపిక సందర్భంగా ప్రతిభ చాటడంతో ఎంపిక చేశారు. వచ్చే నెల 3వ తేదీ నుంచి 3 రోజుల పాటు భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో నిర్వహించే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొననున్నారు. ఎంఈవో కొండాపురం బాలరాజు, ప్రధానోపాధ్యాయులు విష్ణువర్ధన్‌రెడ్డి, వ్యాయామ ఉపాధ్యాయుడు వెంకట్, సంతోష తదితరులు విద్యార్థిని అభినందించారు.

బాలభవన్‌లో జానపద పోటీలు



విద్యార్థినుల ప్రదర్శన

వనపర్తి పట్టణం, న్యూస్‌టుడే: జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో జాతీయ సైన్స్ డ్రామా ఫెస్టివల్, జానపద నృత్య పోటీలు శనివారం బాలభవన్‌లో నిర్వహించారు. జిల్లాలోని వివిధ పాఠశాల విద్యార్థులు పాల్గొని ప్రదర్శన చేశారు. జానపద నృత్యం పోటీలో వనపర్తి బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థినులు ప్రథమ బహుమతి సాధించగా.. రెండు, మూడు స్థానాల్లో కేతేపల్లి, రంగాపూర్ పాఠశాలల విద్యార్థులు గెలుపొందారు. సైన్స్ డ్రామా ఫెస్టివల్‌లో మొదటి స్థానంలో వనపర్తిలోని ఓ ప్రైవేట్ పాఠశాల, ద్వితీయ, తృతీయ స్థానాల్లో వనపర్తి, గోపాల్‌పేట బాలికోన్నత పాఠశాలల నిలిచాయి. విజేతలకు జిల్లా అకాడమిక్ మానిటరింగ్ అధికారి మహానంది, సైన్స్ అధికారి శ్రీనివాసులు బహుమతులు అందించారు.

కేతేపల్లి విద్యార్థుల ప్రతిభ...

పాన్‌గల్, న్యూస్‌టుడే : వనపర్తి జిల్లా కేంద్రంలో రాష్ట్ర విద్యా శిక్షణ పరిశోధన సంస్థ, జనాభా విద్యా విభాగం, జిల్లా విద్యాశాఖ సంయుక్తంగా నిర్వహించిన జిల్లా స్థాయి జానపద నృత్య పోటీలలో మండలంలోని కేతేపల్లి ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రతిభ చాటారు. ద్వితీయ స్థానంలో నిలిచి నగదు, జ్ఞాపికను అందుకున్నారు. శిక్షణ ఇచ్చిన ఉపాధ్యాయులు గోపాల్‌ను, విద్యార్థులను ఎంఈవో శ్రీనివాసులు, పాఠశాల ఉపాధ్యాయులు అభినందించారు.

ఫ్లాష్.. ఫ్లాష్.. ఫ్లాష్

జాతీయ రహదారిపై రోడ్డు ప్రమాదం

◆ రెండు వాహనాల ఢీ ◆ 10 మందికి తీవ్ర గాయాలు ◆ ముగ్గురి పరిస్థితి విషమం ◆ క్షతగాత్రులను అనంతపురం ఆసుపత్రికి తరలింపు

గార్లదిన్నె, న్యూస్‌టుడే: బెంగళూరు నుంచి హైదరాబాద్ వెళ్తోన్న ఏవీఎం ట్రావెల్ బస్సు, ఇదే మార్గంలో మహబూబ్‌నగర్ జిల్లా కొత్తకోటకు వెళ్తోన్న ఐచర్ వాహనం శనివారం అర్ధరాత్రి దాటాక 2.30 గంటల ప్రాంతంలో జాతీయ రహదారి 44పై గార్లదిన్నె మండలం కలగాసపల్లి వద్ద ఢీకొన్నాయి. ఈ ఘటనలో 10 మందికి తీవ్ర గాయాలయ్యాయి. వీరిలో బస్సు క్లీనర్, ఇద్దరు కూలీల పరిస్థితి విషమంగా ఉంది. క్షతగాత్రులను అనంతపురం ప్రభుత్వ ఆసుపత్రి తరలించారు. గాయపడిన వారు తెలంగాణ రాష్ట్రం మహబూబ్‌నగర్‌కు చెందిన కూలీలు. ఈ ఘటనతో జాతీయ రహదారిపై ట్రాఫిక్ పూర్తిగా స్తంభించింది. ఎస్ఐ గౌస్ బాషా, పోలీస్ సిబ్బందితో ఘటనా స్థలికి చేరుకొని సహాయ చర్యలు చేపట్టారు. రాకపోకలు సాఫీగా జరిగేలా పర్యవేక్షించారు.







గార్లదిన్నె మండలం కలగాసపల్లి వద్ద జాతీయ రహదారిపై ప్రమాద దృశ్యాలు

అన్ని కులాల అవివాహితులకు సువర్ణావకాశం

నేడు అన్ని కులాల వధూవరులకు ఈనాడు పెళ్లిపందిరి ఉచిత ప్రొఫైల్ రిజిస్ట్రేషన్ కార్యక్రమం



తెలుగింటి వివాహ పరిచయాలకు ఆత్మీయ వేదిక అయిన ఈనాడు పెళ్లిపందిరి, అన్ని కులాల అవివాహిత వధూవరులకు ఉచిత ప్రొఫైల్ రిజిస్ట్రేషన్ కార్యక్రమం నిర్వహిస్తుంది. మహబూబ్‌నగర్ ఈనాడు ప్రాంతీయ కార్యాలయం H.No.: 1-6-65/3, తెలంగాణ చౌరస్తా, సుభాష్‌నగర్‌లో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. వివాహం కోసం ఎదురుచూస్తున్న వారు సంబంధిత కుటుంబీకులు నేడు (29 సెప్టెంబరు 2024, ఆదివారం) ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు ఈ కార్యక్రమంలో పాల్గొని తమ ప్రొఫైల్‌ను ఉచితంగా రిజిస్టర్ చేసుకోవచ్చు.

మరిన్ని వివరాలకు 91543 40820 & 91549 92572 ఫోన్ నంబర్లను సంప్రదించవచ్చు.

ఉచిత ప్రొఫైల్ రిజిస్ట్రేషన్ ఫోన్ ద్వారా కూడా చేసుకోవచ్చు. రిజిస్ట్రేషన్ చేయదలచిన వధూవరుల బయోడేటా, ఫొటోలు పైన తెలిపిన నంబర్లకు వాట్సాప్ ద్వారా పంపవచ్చు.



విజయం సాధించిన ఉమ్మడి జిల్లా జట్టు క్రికెటర్లతో ఎండీసీఏ ప్రధాన కార్యదర్శి ఎం.రాజశేఖర్

పాలమూరు క్రికెట్ జట్టు శుభారంభం

మహబూబ్‌నగర్ క్రీడలు, న్యూస్‌టుడే : హైదరాబాద్ క్రికెట్ సంఘం (హెచ్‌సీఏ) అండర్-19 వన్డే రాష్ట్ర స్థాయి క్రికెట్ టోర్నీలో ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా జట్టు శుభారంభం చేసింది. శనివారం హన్మకొండ మైదానంలో వరంగల్ జట్టుతో జరిగిన తొలి మ్యాచ్‌లో 34 పరుగుల తేడాతో జిల్లా జట్టు విజయం సాధించింది. మొదట బ్యాటింగ్‌కు దిగిన మహబూబ్‌నగర్ జట్టు 34.5 ఓవర్లలో 121 పరుగులకు ఆలౌట్ అయింది. షాదాబ్ అహ్మద్ 38, కనిష్క్ 13, రాంచరణ్ 13, ముఖీత్ 10 పరుగులు చేశారు. అనంతరం వరంగల్ జట్టు లక్ష్య ఛేదనలో చతికిల పడి 29.4 ఓవర్లలో 87 పరుగులకు ఆలౌట్ అయింది. పాలమూరు జట్టు నుంచి ముఖీత్ 3, షాదాబ్ 2, శశాంక్, అంకిత్, కనిష్క్ చెరో వికెట్ తీశారు. విజయం సాధించిన జిల్లా జట్టు క్రికెటర్లను ఎండీసీఏ ప్రధాన కార్యదర్శి ఎం. రాజశేఖర్, శిక్షకుడు అబ్దుల్లా అభినందించారు.

ఆకాశమే హద్దుగా పర్యాటకుల కోలాహలం

రామోజీ ఫిల్మ్‌సిటీ, న్యూస్‌టుడే: పండగల వేళ పర్యాటకుల రాకతో రామోజీ ఫిల్మ్‌సిటీ సందడిగా మారింది. దసరా, దీపావళి పండగలను పురస్కరించుకుని ఈ నెల 26న ప్రారంభమైన వేడుకల్లో నిత్యం ఉత్సాహంగా పాల్గొంటున్నారు. ఫిల్మ్‌సిటీ సందర్శనకు వచ్చి మ్యాజికల్ గ్లో గార్డెన్ అందాలను వీక్షిస్తూ మురిసిపోతున్నారు. ఫిల్మీ స్ట్రీట్ వినోద షోలు ఆబాలగోపాలాన్ని ఆకట్టుకుంటున్నాయి. ఉదయం 9 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు వేడుకల్లో పాలుపంచుకుంటూ చిన్నా, పెద్ద ఉల్లాసంగా గడుపుతున్నారు.

రామోజీ ఫిల్మ్‌సిటీలో సందడే సందడి







సరదాసరదా కార్యక్రమాలు, వినోదం పంచే ఏర్పాట్లు ప్రతి ఒక్కరినీ ఆనందడోలికల్లో ముంచెత్తుతున్నాయి. లైవ్ షోలు మధురానుభూతిని పంచుతున్నాయి. సాయంత్రం వేళల్లో సంతోషాలను ఆస్వాదించాలనుకునే పర్యాటకులు మధ్యాహ్నం 2 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు కుటుంబ సభ్యులు, బంధుమిత్రులతో కలిసి వచ్చి ఆనందిస్తున్నారు. రామోజీ ఫిల్మ్‌సిటీని సరికొత్త విద్యుద్దీప కాంతుల్లో కళ్లారా వీక్షించి మధుర జ్ఞాపకాలను పదిలం చేసుకుంటున్నారు. స్టూడియో టూర్‌తో ఫిల్మ్‌సిటీని చుట్టేస్తూ సినీజగత్తులో విహరిస్తున్న అనుభూతి పొందుతున్నారు. రాజసం ఉట్టిపడేలా సాగే కార్నివాల్ పరేడ్, సంభ్రమాశ్చర్యాలను కలిగించే మోషన్ క్యాప్చర్, వర్చువల్ షూట్ ఇలా.. అనుక్షణం ఆనంద వీక్షణాలతో పండగల వేళ చిన్నాపెద్దా ఆనందిస్తున్నారు. ఇంకెందుకు ఆలస్యం.. మీరూ రామోజీ ఫిల్మ్‌సిటీ సంబరాల్లో పాలుపంచుకోవచ్చు పదండి.

రవాణా సౌకర్యం.. రామోజీ ఫిల్మ్‌సిటీలో పండగ సంబరాలను వీక్షించే పర్యాటకులకు హైదరాబాద్ నగరంలోని వివిధ ఎంపిక చేసిన ప్రాంతాల నుంచి పిక్-అప్, డ్రాపింగ్ సౌకర్యం కల్పిస్తున్నారు. ఎలాంటి ఇబ్బంది లేకుండా వేడుకలను ఆస్వాదించేందుకు వచ్చే వారికి ఇది ఎంతగానో దోహదపడుతుంది.

మరిన్ని వివరాలకు.. www.ramojifilmcity.com ఫోన్ నంబర్ 76598 76598ను సంప్రదించవచ్చు.



ఎన్టీఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో బతుకమ్మ ఆడుతున్న యువతులు, మహిళలు

ఒక్కేసి పువ్వేసి సందమామ!

ఎన్టీఆర్ మహిళా డిగ్రీ కళాశాలలో ఉత్సాహంగా బతుకమ్మ సంబరాలు



బతుకమ్మతో నారాయణపేట ఎమ్మెల్యే డా.పర్ణికారెడ్డి, విద్యార్థినులు



బతుకమ్మతో యువతులు

మహబూబ్‌నగర్ సాంస్కృతికం, న్యూస్‌టుడే: రంగురంగుల పూలతో పేర్చిన బతుకమ్మలు.. సంప్రదాయ దుస్తుల్లో ముస్తాబై వచ్చిన విద్యార్థినులు, అధ్యాపకులతో మహబూబ్‌నగర్‌లోని ఎన్టీఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల సందడిగా మారింది. చప్పట్లు కొడుతూ వందలాది గొంతుకలు ఒక్కటై ఆలపించిన బతుకమ్మ పాటలు అందరిని తన్మయత్వానికి లోనుచేశాయి. కళాశాలలో ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో నిర్వహించిన ముందస్తు బతుకమ్మ వేడుకలు ఉత్సాహంగా సాగాయి. ముఖ్యఅతిథులుగా ఎమ్మెల్యేలు యెన్నం శ్రీనివాస్‌రెడ్డి, డా.పర్ణికారెడ్డి, రాష్ట్ర అల్పసంఖ్యాక వర్గాల ఆర్థిక సంఘం అధ్యక్షుడు ఒబేదుల్లా కొత్వాల్, పుర అధ్యక్షుడు ఆనంద్‌కుమార్ గౌడ్ పాల్గొన్నారు. తెలంగాణ సంస్కృతికి ప్రతీక అయిన బతుకమ్మ పండగ గొప్పతనాన్ని వివరించారు. ఆధ్యాత్మికత, ప్రకృతి పరిరక్షణ ఈ వేడుక పరమార్థమని అభిప్రాయపడ్డారు. అనంతరం విద్యార్థినులతో కలిసి కొద్దిసేపు సరదాగా బతుకమ్మ ఆడారు. కార్యక్రమంలో మార్కెట్ ఉపాధ్యక్షుడు పెద్ద విజయకుమార్, కళాశాల ప్రిన్సిపల్ రాజేంద్రప్రసాద్, ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర కార్యదర్శి ముకుందం రమేష్, కాంగ్రెస్, ఎన్ఎస్‌యూఐ నాయకులు సిరాజ్ ఖాద్రి, లక్ష్మయాదవ్, శివ, నవీన్, ఎన్టీఆర్ డిగ్రీ కళాశాల అధ్యాపకులు, విద్యార్థినులు పాల్గొన్నారు.



ఆస్పత్రుల్లో యోగా బోధకుల భర్తీకి మౌఖిక పరీక్ష

మహబూబ్‌నగర్ పట్టణం, న్యూస్‌టుడే : రాష్ట్ర ప్రభుత్వ ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్ ఆస్పత్రుల్లో యోగా బోధకుల పోస్టుల భర్తీకి ఈ నెల 30న మహబూబ్‌నగర్ జనరల్ ఆస్పత్రిలోని ఆయుష్ ఆయుర్వేద ఆస్పత్రిలో ఉదయం 10.30 గంటలకు మౌఖిక పరీక్ష నిర్వహిస్తున్నట్లు ఆయుష్ ఉమ్మడి జిల్లా అధికారి డా.ఆదిశేషయ్య శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. మహబూబ్‌నగర్‌లో 15 మంది పురుషులు, 15 మంది మహిళలు, నాగర్‌కర్నూల్‌లో 19 - పు॥, 19 - మ॥, వనపర్తిలో 9 - పు॥, 9 - మ॥, జోగులాంబ గద్వాలలో 9 - పు॥, 9 - మ॥, నారాయణపేట జిల్లాలో 8 మంది పురుషులు, 8 మంది మహిళలు భర్తీ చేయనున్నట్లు పేర్కొన్నారు. అభ్యర్థులు పదో తరగతి లేదా ఇంటర్ విద్యార్హతలు, ఆరు నెలల యోగా శిక్షణ పొందిన ధ్రువపత్రం కలిగి ఉన్న 45 ఏళ్లలోపు వారు అర్హులని తెలిపారు. ఆధార్, విద్యార్హత, యోగా ధ్రువపత్రాలతో ఆసుపత్రిలో నివేదించాలని సూచించారు.

కంచే చేను మేస్తే..!

- అక్రమ వసూళ్లతో గాడి తప్పుతున్న పోలీసులు
- ఎవరికి చెప్పుకోలేక బాధితుల అవస్థలు




కందనూలు, న్యూస్‌టుడే : ప్రజలకు రక్షణగా నిలిచి ధన, మాన, ప్రాణ, ఆస్తులను కాపాడాల్సిన రక్షక భటులు కొందరు అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నారు. అవినీతికి పాల్పడుతూ వ్యక్తిగత విషయాల్లోనూ తలదూరుస్తూ వివాదాస్పదమవుతున్నారు. క్రమశిక్షణకు మారుపేరైన పోలీసు వ్యవస్థ ప్రతిష్ఠ దిగజారుతున్నారు. బాధితులు పోలీసులను ఆశ్రయించాలంటేనే జంకే పరిస్థితి ఉంది. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా జిల్లాలో కొన్ని ఠాణాలు ఆ శాఖ తలవంపులు తెచ్చేలా ఉన్నాయి. ఉన్నతాధికారులు రంగంలోకి దిగి చర్యలు చేపడుతుండటంతో కేసులు నమోదవుతూ వెలుగులోకి వస్తున్నాయి.



నాగర్‌కర్నూల్ : బిజినేపల్లి ఠాణాలో వివరాలు పరిశీలిస్తున్న జిల్లా ఎస్పీ గైక్వాడ్ వైభవ్ రఘునాథ్ (పాత చిత్రం)

బెదిరింపులకు పాల్పడి..: మే 15న నాగర్‌కర్నూల్ పట్టణంలోని నల్లవెల్లి రోడ్డు పక్కన బిజినేపల్లి మండలం శేరిపల్లికి చెందిన ఓ వ్యక్తి కారులో తన స్నేహితురాలితో కలిసి భోజనం చేస్తుండగా బ్లూకోల్ట్స్ కానిస్టేబుల్ ట్యాబ్‌తో ఫొటో తీశారు. రూ. 10 వేలు ఇవ్వకపోతే కొత్త చట్టాల ప్రకారం కేసు నమోదు చేస్తామని భయభ్రాంతులకు గురి చేశారు. గత్యంతరం లేక బాధితుడు రూ. 2 వేలు కానిస్టేబుల్ స్నేహితుని ఖాతాకు అంతర్జాలం ద్వారా చెల్లించారు. బిజినేపల్లి ఠాణాలో విధులు నిర్వహించే మరో కానిస్టేబుల్ ఇదే తరహా బెదిరింపులకు పాల్పడటమే కాక ఫొటోను కుటుంబ సభ్యులకు చూపడంతో కుటుంబ కలహాలు నెలకొన్నాయి. విషయం వెలుగులోకి రావడంతో ఉన్నతాధికారులు విచారించి ఇద్దరు కానిస్టేబుళ్లను సస్పెండ్ చేశారు.



బిజినేపల్లి ఠాణాలోని ఓ కానిస్టేబుల్‌పై ఫిర్యాదు చేసిన బాధితుడు

తాత ఫిర్యాదుతో..: బిజినేపల్లి మండలం గంగారం గ్రామానికి చెందిన యువకుడు సురేశ్ అదే గ్రామానికి చెందిన యువతిని ప్రేమ వివాహం చేసుకున్నారు. ఈనెల 26న గురువారం గ్రామానికి రాగా యువతి తల్లిదండ్రులు యువకుడి మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. సురేశ్ డయల్ 100కి సమాచారం ఇచ్చారు. బిజినేపల్లి ఠాణాలో విధులు నిర్వహిస్తున్న ఓ కానిస్టేబుల్ వచ్చి మీకు సహాయం చేస్తానని సురేశ్ నుంచి రూ. 2 వేలు వసూలు చేశారు. విషయం తెలుసుకున్న సురేశ్ తాత వెంకయ్య శుక్రవారం ఠాణాలో లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేశారు. ఘటనపై ఉన్నతాధికారులు విచారణ నిర్వహిస్తున్నారు.

నేరుగా రంగంలోకి ఉన్నతాధికారులు..

బిజినేపల్లి మండల పరిధిలో జూదం జోరుగా కొనసాగుతోంది. వారంలో రెండు సార్లు జూదం కేసులు నమోదవుతున్నాయి. పోలీసు సిబ్బంది అక్రమ వసూళ్లకు అలవాటు పడి దాడులు చేయడం లేదన్న ఆరోపణలున్నాయి. నాగర్‌కర్నూల్ డివిజన్ పరిధిలోని డీఎస్పీ, సీఐ రహస్య సమాచారం మేరకు నేరుగా రంగంలోకి దిగి దాడులు చేస్తూ జూదరులను అరెస్టు చేస్తుండటం గమనార్హం.

డయల్ 100ను ఆసరాగా అక్రమ వసూళ్లు

రాష్ట్ర ప్రభుత్వం క్షేత్రస్థాయిలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలిగినా సత్వర న్యాయం కోసం డయల్ 100కు సమాచారం ఇవ్వాలని అవగాహన కల్పిస్తున్నారు. అందిన ఫిర్యాదులను పరిశీలించడానికి బ్లూకోర్ట్స్ సిబ్బంది సంఘటనా స్థలానికి వెళ్తున్నారు. ఇరువర్గాల మధ్య చిన్న ఘర్షణ జరిగినా ఓ వర్గానికి చెందిన వారిని బెదిరించి అక్రమ వసూళ్లు చేస్తున్నారు. అలాగే రాత్రి సమయంలో ఒంటరిగా ఉండే జంటల చిత్రాలను తీసి బెదిరింపులకు పాల్పడి వారి వద్ద అందిన కాడికి దండుకుంటున్నారు. గ్రామ, పట్టణ శివారు ప్రాంతాల్లో మద్యం తాగుతున్నట్లు సమాచారం వచ్చినా డబ్బులు వసూలు చేసి వారిని అక్కడి నుంచి తప్పిస్తున్నారు. ఇదే తరహాలో అక్రమ వసూళ్లకు పాల్పడి నాగర్‌కర్నూల్ జిల్లాలో ఇద్దరు కానిస్టేబుళ్లు సస్పెండ్ అయ్యారు.

సమాచారం ఇచ్చిన వారే లక్ష్యం

కల్వకుర్తి డివిజన్ పరిధిలో ఇసుక అక్రమ రవాణా జోరుగా సాగుతోంది. రాత్రి వేళ గుట్టుగా సాగుతుండటంతో గ్రామస్థులు డయల్ 100 ద్వారా సమాచారం ఇస్తున్నారు. సిబ్బంది అక్రమార్కుల నుంచి డబ్బులు వసూళ్లు చేస్తూ ట్రాక్టర్లను విడిచిపెడుతున్నారన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. సిబ్బందిని ప్రశ్నిస్తే గ్రామస్థులపైనే కేసులు నమోదు చేస్తామని భయభ్రాంతులకు గురి చేస్తున్నారని స్థానికులు పేర్కొంటున్నారు.


కఠిన చర్యలు తీసుకుంటాం..

సిబ్బంది క్రమశిక్షణారాహిత్యాన్ని ఉపేక్షించబోం. అవినీతికి పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటాం. ఆరోపణలు వచ్చిన వెంటనే సిబ్బందిపై విచారణ నిర్వహిస్తున్నాం.

- గైక్వాడ్ వైభవ్ రఘునాథ్, ఎస్పీ నాగర్‌కర్నూల్



అర్హులందరికీ రూ.2లక్షల రుణమాఫీ: మంత్రి జూపల్లి



మాట్లాడుతున్న మంత్రి జూపల్లి, పక్కన డీసీసీబీ ఛైర్మన్ విష్ణువర్ధన్‌రెడ్డి

పాన్‌గల్, న్యూస్‌టుడే : ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ పార్టీ రైతులకు ఇచ్చిన మాట ప్రకారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పథకాలు అమలుచేస్తున్నారని, అర్హులైన రైతులందరికీ రూ.2లక్షల రుణమాఫీ తప్పక చేస్తామని మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. శనివారం పాన్‌గల్ రైతు వేదికలో విండో మహాజనసభ డీసీసీబీ ఛైర్మన్ విష్ణువర్ధన్‌రెడ్డి అధ్యక్షతన నిర్వహించిన సభకు ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి ఇబ్బందికరంగా ఉన్నా కాంగ్రెస్ ప్రభుత్వం పథకాలను అమలు చేస్తుందని గుర్తుచేశారు. రుణమాఫీకి అర్హులై ఉండి చిన్న చిన్న పొరపాట్లతో కానీ వారికి ప్రభుత్వం చర్యలు చేపట్టిందన్నారు. ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులు పర్యాటక, చారిత్రక ప్రాంతాలను ఉచితంగా సందర్శించి జ్ఞానాన్ని పొందాలని మంత్రి సూచించారు. పాన్‌గల్ బాలుర ఉన్నత పాఠశాలలో శనివారం 'తెలంగాణ దర్శిని' కార్యక్రమం అమలుపై విద్యార్థులకు వివరించారు. డీసీసీబీ ఛైర్మన్ మామిళ్లపల్లి విష్ణువర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ.. సింగిల్ విండోల ద్వారా రైతులకు ఇంకా మెరుగైన సేవలు అందించడానికి కృషిచేస్తామన్నారు. అనంతరం రెడ్డిసేవాసమితి ఆధ్వర్యంలో ఛైర్మన్‌ను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో డీఈవో గోవిందరాజులు, డీపీవో సురేష్, ఎంఈవో శ్రీనివాసులు, విండో వైస్ ఛైర్మన్ బాలయ్య, సీఈవో భాస్కర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

చేపల వేటకు వెళ్లి ఒకరి మృతి

తిమ్మాజిపేట, న్యూస్‌టుడే : చేపల వేటకు వెళ్లి నీటిలో మునిగి ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన తిమ్మాజిపేటలో చోటు చేసుకుంది. ఎస్సై నరేందర్‌రెడ్డి కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన శేఖర్ (45) శనివారం ఉదయం చేపలు తీసుకొస్తానంటూ గ్రామ సమీపంలోని రాళ్ల చెరువుకు వెళ్లారు. చేపలు పట్టే క్రమంలో కాలుజారి చెరువులో పడిపోయారు. పక్కనే పొలంలో పనులు చేసుకుంటున్న కొందరు గుర్తించి కుటుంబ సభ్యులకు, గ్రామస్థులకు సమాచారమిచ్చారు. అందరూ వెళ్లి చెరువులో శేఖర్‌ను బయటకు తీయగా అప్పటికే మృతి చెందాడు. అతడికి భార్య, ముగ్గురు పిల్లలున్నారు. బాధిత కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.



శేఖర్

'ప్రభుత్వంపై బీసీల్లో అపనమ్మకం'



ధర్నాలో మాట్లాడుతున్న ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్

కల్వకుర్తి, న్యూస్‌టుడే : కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి 10 నెలలు కావొస్తున్నా బీసీ గణనపై ఊసేలేదని ప్రభుత్వ వైఖరితో బీసీ వర్గాల్లో ఆశలు సన్నగిల్లుతున్నాయని భారాస నాయకుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ అన్నారు. శనివారం నాగర్‌కర్నూల్ జిల్లా కల్వకుర్తి పట్టణంలో బీసీ మహాసభ ధర్నాకు హాజరైన ఆయన మాట్లాడారు. స్వాతంత్ర్యం వచ్చి 77 ఏళ్లు కావొస్తున్న బీసీ వర్గాలు బడుగులుగానే ఉండటానికి కారకులెవరో చెప్పాలన్నారు. 50 శాతానికి పైగా జనాభా ఉన్న బీసీలకు రిజర్వేషన్లు ప్రకటించాలని డిమాండ్ చేశారు. ప్రత్యేక ఉద్యమానికి కల్వకుర్తి నుంచే శ్రీకారం చుట్టామన్నారు. ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న మాట్లాడుతు రాష్ట్రంలో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల అమలు బాధ్యత తనదేనని భరోసా కల్పించారు. బీసీలు రాజ్యాధికారం వైపు అడుగులు వేయాలని పిలుపునిచ్చారు.

చికెన్ ధరలు

ఫాంరేటు	125-00
రిటైల్	147-00
డ్రెస్డ్	213-00
స్కిన్‌లెస్	243-00

తెరపై ఈనాడు

శ్రీనివాస: **దేవర** వెంకటేశ్వర: **సత్యం సుందరం**

– న్యూస్‌టుడే, వనపర్తి న్యూటౌన్

లోక్‌అదాలత్ కమిటీ సభ్యుల నియామకం

ఆత్మకూరు, న్యూస్‌టుడే : ఆత్మకూరు జూనియర్ సివిల్ కోర్టు లోక్‌అదాలత్ కమిటీ సభ్యులుగా న్యాయవాదులు దివాన్జీ అశోక్‌రావు, వై.విజయభాస్కర్‌రెడ్డి నియమితులయ్యారు. శనివారం వారు బాధ్యతలు స్వీకరించారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు అక్కల నారాయణగౌడ్, సీనియర్ న్యాయవాదులు రామేశ్వర్‌రెడ్డి, మొగిలి గంగాధర్‌గౌడ్, తిప్పారెడ్డి, ముక్తేశ్వర్, జీకే రాములు తదితరులు వారికి అభినందనలు తెలిపారు.

'వానాకాలం ముగుస్తున్నా రైతు భరోసా జాడలేదు'

వనపర్తి పట్టణం, న్యూస్‌టుడే: వానకాలం ముగుస్తున్నా రైతు భరోసా విడుదల కాలేదని మాజీమంత్రి నిరంజన్‌రెడ్డి మండిపడ్డారు. అరకొరగా రుణమాఫీ చేసి ప్రభుత్వం చేతులు దులుపుకుందని, రైతులు ఇప్పటికీ రుణాలు మాఫీకాక బ్యాంకుల చుట్టూ తిరుగుతున్నారని శనివారం ఓ ప్రకటనలో ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం పథకాలను గాలికొదిలేసిందని విమర్శించారు. అక్టోబరు వరకు అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో ముఖ్యమంత్రి ఫోటో పెట్టాలని ఆదేశాలు జారీ చేయడం సిగ్గు చేటు అన్నారు. బతుకమ్మ చీరలు నిలిపేసి నేతన్నలకు ఉపాధి లేకుండా చేశారని మండిపడ్డారు.

రైతుల సంక్షేమానికి కృషి



మహజన సభలో మాట్లాడుతున్న పామాపురం పీఏసీఎస్ అధ్యక్షుడు

కొత్తకోట గ్రామీణం, న్యూస్‌టుడే : ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు రైతుల సంక్షేమానికి కృషి చేస్తోందని పామాపురం సింగిల్‌విండో అధ్యక్షుడు వాసుదేవారెడ్డి అన్నారు. మండలంలోని విలియంకొండలో శనివారం నిర్వహించిన మహజన సభ సర్వసభ్య సమావేశానికి హాజరై మాట్లాడారు. ఆయన మాట్లాడుతూ.. రుణమాఫీ అయిన రైతులకు కొత్త రుణాలను అందిస్తున్నామన్నారు. వచ్చే రబీకి మిరాసిపల్లి, రామకృష్ణాపురం గ్రామాల్లో ఎరువుల దుకాణం ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామన్నారు. ఉపాధ్యక్షుడు వెంకటేశ్, సీఈవో రాఘవేంద్రరెడ్డి, డైరెక్టర్లు, రైతులు పాల్గొన్నారు.

ప్రైవేట్ పాఠశాలల్లో 25 శాతం సీట్లు కేటాయించాలి

వనపర్తిగ్రామీణం, న్యూస్‌టుడే : సమాజంలో దళిత వర్గ పిల్లలకు ప్రైవేట్ పాఠశాలల్లో విద్యనభ్యసించేందుకు ప్రభుత్వం కల్పించిన 25 శాతం సీట్లను కల్పించేందుకు చర్యలు తీసుకోవాలని దళిత హక్కుల పోరాట సమితి జిల్లా కార్యదర్శి రవీందర్ అన్నారు. ఈ మేరకు శనివారం కలెక్టర్ కార్యాలయంలోని సూపరింటెండెంట్ మదన్‌మోహన్‌కు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు శ్రీరామ్, రమేష్, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

పంట సాగుపై రైతులకు అవగాహన



పంటలను పరిశీలిస్తున్న రాష్ట్ర పంటల సాగు ఖర్చుల పథకం డైరెక్టర్ సుహాసిని

వనపర్తిగ్రామీణం, న్యూస్‌టుడే : పంటలు సాగు చేసే విధానంలో అధిక ఖర్చులు కాకుండా రైతులు జాగ్రత్తలు పాటించాలని రాష్ట్ర సాగు ఖర్చుల పథకం డైరెక్టర్ సుహాసిని అన్నారు. శనివారం మండలంలోని చిట్యాల గ్రామంలోని రైతు వేదికలో ఏఈవోలకు సాగు ఖర్చులపై నిర్వహించిన కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. అనంతరం రైతుల పొలాలను పరిశీలించారు. సాగులోని మెళకువలను రైతులకు సూచించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ స్టాటిస్టిషన్ దినేష్, ఫీల్డ్ సూపర్‌వైజర్ సుమన్, ఏఈవోలు తదితరులు పాల్గొన్నారు.

భవిత సెంటర్‌లో ఫిజియోథెరపీ



దివ్యాంగులకు ఫిజియోథెరపీ నిర్వహిస్తున్న పవన్‌కుమార్‌గౌడ్

ఖిల్లాగనపురం, న్యూస్‌టుడే: మండల కేంద్రంలోని భవిత సెంటర్లో దివ్యాంగులకు శనివారం ఫిజియోథెరపీ నిర్వహించినట్లు ఎంఈవో జయశంకర్ తెలిపారు. వివిధ గ్రామాల నుంచి దివ్యాంగులకు ఫిజియోథెరపిస్ట్ పవన్‌కుమార్‌గౌడ్ వైద్య పరీక్షలు నిర్వహించారు. ప్రతి శుక్రవారం భవిత సెంటర్‌లో ఫిజియోథెరపీ నిర్వహించడం జరుగుతుందని అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఐఆర్‌పీ ఉపాధ్యాయులు రజిత, మల్లీశ్వరీ, ఎమ్మార్సీ సిబ్బంది పాల్గొన్నారు.

బదిలీ ఉపాధ్యాయులను వెంటనే రిలీవ్ చేయాలి

వనపర్తి పట్టణం, న్యూస్‌టుడే: జిల్లాలో బదిలీ అయిన ఎస్జీటీలను రిలీవ్ చేయాలని ఉపాధ్యాయ సంఘాల పోరాట సమితి ఆధ్వర్యంలో శనివారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలోని ఇన్ వార్డులో వినతిపత్రం అందించారు. ఉపాధ్యాయల సంఘాల నాయకులు మాట్లాడుతూ.. జీవో నంబరు 25ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో టీఎస్ యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు రవిప్రసాద్, కార్యదర్శి కృష్ణయ్య, నాయకులు మద్దిలేటి, వెంకటనారాయణ పాల్గొన్నారు.

మితిమీరిన పోకిరీల ఆగడాలు



మినీ స్టేడియంలో బద్దలు కొట్టిన తలుపులు

ఆత్మకూరు, న్యూస్‌టుడే : ఆత్మకూరు పట్టణంలో పోకిరీల ఆగడాలు తీవ్రమవుతున్నాయి. రాత్రి వేళల్లో ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, క్రీడా మైదానాల్లో అసాంఘీక కార్యకలాపాలకు పాల్పడుతున్నారు. బహిరంగ ప్రదేశాల్లో మందు తాగుతూ జన జీవనానికి విఘాతం కలిగిస్తున్నారు. సరస్వతీ శిశుమందిర్, పాత బీసీ హాస్టల్, జాతర మైదానం మినీ స్టేడియం భవనాలను అడ్డాలుగా మార్చుకొని వ్యవహరిస్తున్నారు. శుక్రవారం రాత్రి మినీ స్టేడియం భవనం తలుపులు, చైతన్య భారతి పాఠశాల గదుల బద్దలు కొట్టారు. ఈ విషయమై ఎస్ఐ నరేందర్‌ను 'న్యూస్‌టుడే' వివరణ కోరగా రాత్రి వేళల్లో గస్తీ పెంచుతామని, పోకిరీల పట్ల ఉపేక్షించే ధోరణి ఉండబోదని పేర్కొన్నారు.

పేరుకుపోతున్న నల్లా బిల్లుల బకాయిలు



వనపర్తిలో నల్లా బిల్లులను వసూలు చేస్తున్న బిల్ కలెక్టర్ శ్రీనివాసులు

వనపర్తి న్యూటౌన్, న్యూస్‌టుడే: వనపర్తి జిల్లాలోని పురపాలికలో నల్లా బిల్లులు ఏళ్ల తరబడి వసూలు చేయకపోవడంతో బకాయిలు కుప్పలుగా పేరుకుపోతున్నాయి ఆర్థిక సంవత్సరం ముగింపు సమయంలో ఆదరాబాదరగా వసూలు చేసి ఆ తరువాత పట్టించుకోకపోవడం లేదు. దీంతో బిల్లులు బకాయిలు పెరిగిపోయాయి. ఒక్క వనపర్తి పురపాలికలో లక్షల్లో బకాయిలున్నాయి.

ప్రభుత్వం సర్కారు నల్లాలను ఎప్పుడో తీసివేయగా కేవలం గృహ, కమర్షియల్ నల్లాలు మాత్రమే ఉన్నాయి. ప్రతి నెలా నల్లా బిల్లులు వసూలు చేయాల్సి ఉండగా సిబ్బంది కొరతతో వాటిపై దృష్టి కేంద్రీకరించడం లేదనే వాదన వినిపిస్తోంది. తాజాగా కార్మికులకు వేతనాలిచ్చేందుకు నిధులు లేకపోవడంతో తిరిగి బిల్లులు వసూలు చేయాలని నిర్ణయించారు. గతంలో పురపాలిక సిబ్బంది ఆఫ్‌లైన్‌లో బిల్లులు వసూలు చేసి ఖాతాలో జమ చేయకపోవడంతో బకాయిలు ఉన్నట్లుగానే దస్త్రంలో చూపించడంతో జనం ఖంగుతిన్నారు. మరోసారి అదే పరిస్థితి తలెత్తకుండా చూడాలని ప్రజలు కోరుతున్నారు.

ఏళ్లుగా పెండింగ్ బకాయిలు..

వనపర్తి పురపాలికల్లో 18 ఏళ్లుగా బకాయిలు పేరుకుపోయాయి. గతంలో బిల్లులు వసూలు చేసిన అధికారులు అవకతవకలకు పాల్పడ్డారన్న నేపథ్యంలో ప్రస్తుతం బిల్లులు వసూలు చేయాలంటే సిబ్బంది భయపడుతున్నారు. 2006 నుంచి ఇప్పటి వరకు ఇళ్ల నిర్మాణాలు, నల్లా కనెక్షన్లు పెరిగాయి. దీనికి అనుగుణంగా బిల్లులు సకాలంలో వసూలు కాకపోవడంతో బకాయిలు రూ.కోట్లకు చేరుకున్నాయి. ప్రతి నెల ఇంటి వినియోగదారుడు రూ.140, కమర్షియల్ నల్లా వాడే వారు రూ.200ల చొప్పున బిల్లులు చెల్లిస్తారు. వనపర్తి పురపాలికలో రూ.6కోట్లు, కొత్తకోటలో రూ.36లక్షలు, ఆత్మకూరులో 13.17లక్షలు, అమరచింతలో రూ.10లక్షలు చొప్పున బకాయిలున్నాయి.

బిల్లుల వసూలుపై దృష్టి సారిస్తాం

పురపాలికలో నల్లా బిల్లులు వసూలు చేసేందుకు ప్రత్యేకంగా సిబ్బందిని నాలుగు బృందాలుగా ఏర్పాటు చేసి వారికి బిల్లింగ్ యంత్రాలను ఇచ్చాం. మార్చి నెలాఖరు కల్లా లక్ష్యాన్ని చేరుకుంటాం.

- పూర్ణచందర్, కమిషనర్, పురపాలిక వనపర్తి

స్వామినాథన్‌కి ఘన నివాళి



పెబ్బేరు: నివాళులర్పిస్తున్న మార్కెట్ కమిటీ అధ్యక్షురాలు ప్రమోదినిరెడ్డి, ఉపాధ్యక్షుడు ఎద్దుల విజయవర్ధన్‌రెడ్డి

పెబ్బేరు పట్టణం, న్యూస్‌టుడే : భారతదేశ వ్యవసాయ రంగం ముఖచిత్రాన్ని సమూలంగా మార్చేసిన హరితవిప్లవ పితామహుడు భారతరత్న ఎంఎస్ స్వామినాథన్ ప్రథమ వర్ధంతి సందర్భంగా శనివారం వ్యవసాయ మార్కెట్ కమిటీ అధ్యక్షురాలు ప్రమోదిని రెడ్డి ఆధ్వర్యంలో మార్కెట్ కమిటీ కార్యాలయంలో స్వామినాథన్ చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కారుపాకుల వెంట్రాములు, జిల్లా బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు శ్రీనివాసులుగౌడ్, కిసాన్ సెల్ అధ్యక్షుడు జగదీశ్‌రెడ్డి, మార్కెట్ కమిటీ ఉపాధ్యక్షుడు ఎద్దుల విజయవర్ధన్‌రెడ్డి, డైరెక్టర్లు రామన్‌గౌడ్, మోతె రాములు, నేతలు వెంకటేష్ సాగర్, చెలిమిళ్ల రాముడు, మన్నెం, తదితరులు పాల్గొన్నారు.

వనపర్తి వ్యవసాయం, న్యూస్‌టుడే : దేశ వ్యవసాయ రంగంలో తలరాతనే మార్చేసిన వ్యవసాయ శాస్త్రవేత్త ఎంఎస్ స్వామినాథన్ అని కిసాన్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు వేముల శ్రీనివాసరెడ్డి అన్నారు. వనపర్తిలోని తెలంగాణ సీడ్స్ కార్యాలయంలో స్వామినాథన్ మొదటి వర్ధంతిని నిర్వహించారు. సీడ్స్ కార్యాలయం సీనియర్ అసిస్టెంటు వినోద్‌కుమార్, కార్యాలయ సిబ్బంది, నాయకులు వెంకటేష్, ఈశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



వనపర్తిలో నివాళులర్పిస్తున్న అధికారులు, నాయకులు

కొత్తకోట గ్రామీణం, న్యూస్‌టుడే : మండలంలోని విలియంకొండలో శనివారం ఎంఎస్ స్వామినాథన్ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పామాపురం సింగిల్‌విండో అధ్యక్షుడు వాసుదేవారెడ్డి, కాంగ్రెస్ పార్టీ కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షుడు శ్రీనువాస్‌రెడ్డి పూలమాల వేసి నివాళి అర్పించారు.



వనపర్తి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నివాళులర్పిస్తున్న మార్కెట్‌యార్డు అధ్యక్షుడు శ్రీనివాస్‌గౌడ్, నాయకులు



అమరచింత: నివాళి అర్పిస్తున్న పుర వైస్ ఛైర్మన్ గోపి



ఆత్మకూరు: మూలమల్లలో ఆయా పార్టీల నాయకులు

భగత్‌సింగ్ ఆశయాలు యువతకు ఆదర్శనీయం

వనపర్తి న్యూటౌన్, న్యూస్‌టుడే: దేశ స్వాతంత్ర్య ఉద్యమంలో జ్వలించిన నిప్పుకణిక భగత్‌సింగ్ జయంతి సందర్భంగా శనివారం వనపర్తి పట్టణంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో భగత్‌సింగ్ జయంతి ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో మార్కెట్ యార్డు అధ్యక్షుడు శ్రీనివాస్‌గౌడ్, నాయకులు బుచ్చన్న, రాములు, రామిరెడ్డి, రవి తదితరులు పాల్గొన్నారు.

పెబ్బేరు పట్టణం, న్యూస్‌టుడే : శనివారం పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు కారుపాకుల వెంకట్రాములు ఆధ్వర్యంలో సుభాష్ చౌరస్తా వద్ద భగత్‌సింగ్ చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం జిల్లా బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు మాట్లాడారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ అధ్యక్షురాలు ప్రమోదినిరెడ్డి, ఉపాధ్యక్షుడు ఎద్దుల విజయవర్ధన్‌రెడ్డి, డైరెక్టర్లు మోతె రాములు, రామన్‌గౌడ్, ఈరపాగ ఆంజనేయులు, కిసాన్ సెల్ అధ్యక్షుడు జగదీశ్‌రెడ్డి, కొంతం దయాకర్‌రెడ్డి, తోకల సత్యనారాయణ, కొల్లా భరత్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

కొత్తకోట గ్రామీణం, న్యూస్‌టుడే : మండలంలోని కనిమెట్ట ప్రాథమికోన్నత పాఠశాలలో శనివారం భగత్‌సింగ్ జయంతి వేడుకలను నిర్వహించారు. ప్రధానోపాధ్యాయుడు లక్ష్మయ్య, ఉపాధ్యాయులు సుజాత, కల్యాణి, వనజ, యువకులు పరమేశ్ పాల్గొన్నారు.

ఆత్మకూరు, న్యూస్‌టుడే : మండలంలోని మూలమల్ల గ్రామంలో భగత్‌సింగ్ జయంతి కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ కూడలిలో ఉన్న భగత్‌సింగ్ విగ్రహానికి పూల మాలలు వేసి నివాళి అర్పించారు. సీపీఐ జిల్లా నాయకులు మోషె, భరత్, గోవర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

వనపర్తిగ్రామీణం, న్యూస్‌టుడే : పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలో భగత్‌సింగ్ జయంతిని పురస్కరించుకొని సీపీఐ పట్టణ కార్యదర్శి రమేష్ ఆధ్వర్యంలో చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎన్ఎఫ్ఐడబ్ల్యూ జిల్లా నేత కళావతమ్మ, నాయకులు గోపాలకృష్ణ, రవీందర్, తదితరులు పాల్గొన్నారు.

అమరచింత, న్యూస్‌టుడే : భగత్‌సింగ్ ఆశయాలను కొనసాగిస్తామని పుర వైస్ ఛైర్మన్ గోపి అన్నారు. పట్టణంలో ఎస్ఎఫ్ఐ, డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో జీఎస్. భవనం నుంచి భగత్‌సింగ్ విగ్రహం వరకు ర్యాలీ నిర్వహించి నివాళి అర్పించారు. నాయకులు అజయ్, శ్యాంసుందర్ పాల్గొన్నారు. మండలంలోని కొంకలవానిపల్లెలో ఏఐవైఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి కుతుబ్ నివాళి అర్పించారు.



పెబ్బేరు పట్టణంలో నివాళులర్పిస్తున్న మండల కాంగ్రెస్ పార్టీ శ్రేణులు



వనపర్తి: పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తాలో ఏఐవైఎఫ్ విద్యార్థి సంఘాల నాయకులు



కొత్తకోట : కనిమెట్టలో నివాళి అర్పిస్తున్న ప్రధానోపాధ్యాయుడు

పీఆర్టీయూటీఎస్ నూతన కమిటీ ఎన్నిక

శ్రీరంగాపురం, న్యూస్‌టుడే : శ్రీరంగాపురం మండలంలో పీఆర్టీయూటీఎస్ ఉపాధ్యాయ సంఘ సభ్యులు శనివారం మండల నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకొన్నారు. అధ్యక్షుడిగా వసంతపురం రాజు, ఉపాధ్యక్షులుగా నరేష్, సుధాకర్, దామోదర్‌బాబు, పృథ్వీమాత, ప్రధాన కార్యదర్శి నాయిని విష్ణువర్ధన్‌నాయుడు, అసోసియేట్ అధ్యక్షుడిగా కృష్ణమూర్తి, కార్యదర్శులుగా ప్రదీప్, శ్రీనివాస రెడ్డి, ఈశ్వర్, లావణ్యను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు పీఆర్టీయూటీఎస్ జిల్లా అధ్యక్షుడు వరప్రసాద్ తెలిపారు. ఎన్నికల అధికారిగా రామచంద్రయ్య, పరిశీలకుడిగా నాగేశ్వర్‌రెడ్డి వ్యవహరించారు.

భాజపా సభ్యత్వ నమోదు



రేవల్లిలో భాజపా ముఖ్యనాయకులతో మాట్లాడుతున్న జిల్లా అధ్యక్షుడు నారాయణ

పెబ్బేరు, న్యూస్‌టుడే: మండలంలోని రంగాపూర్‌లో శనివారం భాజపా సభ్యత్వ నమోదు కార్యక్రమం చేపట్టారు. ఆ పార్టీ మండల మాజీ అధ్యక్షుడు భగవంత్ యాదవ్ ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. మోదీ ప్రభుత్వం ప్రవేశం పెట్టిన సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్తున్నట్లు చెప్పారు.

రేవల్లి(గోపాల్‌పేట), న్యూస్‌టుడే : ప్రతి పోలింగ్ బూత్ నుంచి సుమారు 200 సభ్యత్వాలు నమోదు చేయాలని భాజపా జిల్లా అధ్యక్షు నారాయణ అన్నారు. శనివారం ఆయన మండల కేంద్రమైన రేవల్లిలో సభ్యత్వాల నమోదుపై సమావేశమయ్యారు. ప్రతి వార్డులో భాజపాను బలోపేతం చేయాలని కోరారు. అజయ్‌గౌడు, జమ్ములు తదితరులు ఉన్నార

క్రైం కార్నర్

చేపల వేటకు వెళ్లి వ్యక్తి మృతి

ఖిల్లాగణపురం, న్యూస్‌టుడే: ఖిల్లా గణపురం మండలం మానాజీపేట గ్రామ శివారులోని బండకుంటలో పడి ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన శనివారం రాత్రి చోటు చేసుకుంది. గ్రామస్థులు వివరాల మేరకు.. ఉప్పరిపల్లి బాలరాజు(52) గ్రామంలో వ్యవసాయం చేసుకుంటూ కుటుంబాన్ని పోషిస్తున్నారు. సాయంత్రం 5గంటల ప్రాంతంలో మానాజీపేట గ్రామ శివారులో బండకుంటలోకి నాగన్న అనే వ్యక్తితో కలిసి చేపలు పట్టేందుకు వెళ్లాడు. ప్రమాదవశాత్తు కుంటలో మునిగి ఎంతకీ బయటికి రాకపోవడంతో నాగన్న గట్టిగా కేకలు వేశాడు. అటుగా వెళ్తున్న ఇద్దరు యువకులు వచ్చి కుంటలో వెతకగా కనిపించలేదు. దీంతో మహబూబ్‌నగర్ గజ ఈతగాళ్లకు గ్రామస్థులు చరవాణి ద్వారా సమాచారం అందించడంతో వచ్చి బయటకి తీశారు. ఈ విషయంపై ఎస్సై సురేశ్‌గౌడ్‌ను వివరణ కోరగా ఎలాంటి ఫిర్యాదు అందలేదని తెలిపారు. మృతుడికి భార్య అలివేలతో పాటు ఇద్దరు కుమారులు, ఒక కూతురు ఉన్నారు.

బస్సు ఢీకొని వృద్ధుడికి తీవ్ర గాయాలు

కొత్తకోట,న్యూస్‌టుడే: మండల పరిధిలోని పాలెం గ్రామానికి చెందిన తాజా మాజీ ఎంపీటీసీ సభ్యుడు పెద్ద నర్సన్న ఆర్టీసీ అద్దె బస్సు ఢీకొనడంతో తీవ్ర గాయాల పాలయ్యారు. ఎస్సై మంజునాథ్‌రెడ్డి కథనం ప్రకారం.. ఉదయం కొత్తకోటకు వచ్చి సాయంత్రం తిరిగి గ్రామానికి వెళ్లేందుకు బస్టాండ్ వద్ద రోడ్డు దాటుతుండగా ఆత్మకూర్ నుంచి వనపర్తికి వెళ్లే బస్సు ఢీ కొట్టడంతో తీవ్రంగా గాయపడ్డాడు. చుట్టుపక్కల వారు వెంటనే స్థానిక ప్రైవేటు ఆసుపత్రికి తరలించి అక్కడి నుంచి మెరుగైన చికిత్స కోసం మహబూబ్‌నగర్ తరలించినట్లు తెలిపారు. క్షతగాత్రుడి కుమారుడు మైబు ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

పట్ట పగలు ఇంట్లో చోరీ

పెబ్బేరు పట్టణం, న్యూస్‌టుడే : పట్టణంలోని రాఘవేంద్ర కాలనీకి చెందిన నాగవేణమ్మ ఇంట్లో శనివారం మధ్యాహ్నం గుర్తు తెలియని వ్యక్తులు చోరీ చేశారు. బాధితురాలి వివరాల మేరకు.. ఉదయం ఇంటికి తాళం వేసి బయటకు వెళ్లి తిరిగి వచ్చి చూడగా ఇంటి తాళాన్ని పగలగొట్టి బీరువాలో ఉన్న రూ.లక్ష నగదును చోరీ చేశారు. విషయం తెలుసుకున్న స్థానిక పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఇన్‌ఛార్జి ఎస్సై రామేశ్వర్‌రెడ్డి తెలిపారు.

ప్లాట్‌ను చదును చేసిన వ్యక్తులపై కేసు నమోదు

వనపర్తి న్యూటౌన్, న్యూస్‌టుడే: ప్లాటును ఆక్రమించిన వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై జలంధర్‌రెడ్డి తెలిపారు. ఆయన వివరాల ప్రకారం... నాగర్‌కర్నూల్ జిల్లా పెంట్లవెల్లి మండలం కొండూరు గ్రామానికి చెందిన మాధవి వనపర్తి పట్టణం నాగవరం గ్రామంలో 20 ఏళ్ల క్రితం ప్లాట్ కొనుగోలు చేశారు. ఆ ప్లాట్‌ను నాగవరం గ్రామానికి చెందిన దేవరాజు, నాగమ్మ, శేఖర్‌లు చదును చేశారని బాధితురాలు ఆరోపించారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు ముగ్గురు వ్యక్తులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఆత్మకూరులో మెగా లోక్‌అదాలత్



ఆత్మకూరు లోక్ అదాలత్‌లో పాల్గొన్న న్యాయమూర్తి శిరీష, న్యాయవాదులు

ఆత్మకూరు, న్యూస్‌టుడే : ఆత్మకూరు జూనియర్ సివిల్ కోర్టులో శనివారం మెగా లోక్‌అదాలత్ నిర్వహించారు. న్యాయమూర్తి శిరీష అధ్యక్షతన జరిగిన లోక్ అదాలత్‌లో సభ్యులు అశోక్‌కుమార్, విజయభాస్కర్ రెడ్డి సభ్యులుగా వ్యవహరించారు. 24 క్రిమినల్, సివిల్ కేసుల్లో కక్షిదారులు రాజీ పడ్డారు. వాహనాల నిబంధనలను అతిక్రమించిన 147 కేసుల్లో 3 లక్షల వెయ్యి రూపాయల జరిమానాలు విధించారు. నాలుగు బ్యాంకు రుణాల మొండి బకాయి కేసుల్లో రూ.9.05 లక్షల చెల్లింపునకు అంగీకారం లభించింది. సీనియర్ న్యాయవాదులు తిప్పారెడ్డి, రామేశ్వర్‌రెడ్డి, మొగిలి గంగాధర్‌గౌడ్, ముక్తేశ్వర్, జీకే రాములు, శంకర్ లింగం, రాంచందర్ తదితరులు పాల్గొన్నారు.

గ్యాస్ సిలిండర్ల రాయితీ పత్రాలు పంపిణీ



రాయితీ పత్రాలను అందజేస్తున్న కాంగ్రెస్ నాయకులు

గోపాల్‌పేట, న్యూస్‌టుడే : మండలంలోని ఏదుట్ల గ్రామంలో శనివారం గ్యాస్ సిలిండర్ల లబ్ధిదారులకు రాయితీ పత్రాలను పంపిణీ చేశారు. గ్రామంలో స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమాలను నిర్వహించారు. పంచాయతీ కార్యదర్శి, ఆశా కార్యకర్తలు, అంగన్‌వాడీ టీచర్లు, నాయకులు పాల్గొన్నారు.

హామీలు అమలు చేయాలని మంత్రికి వినతి

పాన్‌గల్, న్యూస్‌టుడే : రాష్ట్ర వ్యాప్తంగా విశ్వవిద్యాలయాల్లో పనిచేస్తున్న తాత్కాలిక అధ్యాపకుల సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని శనివారం రాష్ట్ర మంత్రి జూపల్లి కృష్ణారావుకు ఏయూపీటీఏ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డా. ఎర్రం నాగేంద్రం, గట్టయ్య తదితరులు కలిసి వినతి పత్రం అందజేశారు. ఎన్నికల సందర్భంగా మేనిఫెస్టోలో పొందుపర్చిన హామీలు అమలు చేయాలన్నారు.

సంగీతంపై అవగాహన కార్యక్రమం



మదనాపురంలో సంగీత కచేరిలో విద్యార్థి, ఉపాధ్యాయులు

మదనాపురం, న్యూస్‌టుడే : మండల కేంద్రంలోని జడ్పీ ఉన్నత పాఠశాలలో శనివారం నో బ్యాగ్ డే సందర్భంగా సంగీత విభావరి కార్యక్రమం నిర్వహించినట్లు ఇన్‌ఛార్జి ప్రధానోపాధ్యాయులు మహేందర్ గౌడ్ తెలిపారు. విద్యార్థులు విద్యతో పాటు సంగీతం, కళల పట్ల ఆసక్తి పెంచుకోవాలన్నారు. అనంతరం ఆత్మకూర్ పట్టణానికి చెందిన బాల కళాకారుడు సుశాంత్ సంగీత కచేరితో విద్యార్థులకు సంగీతంపై అవగాహన కల్పించారు. ఉపాధ్యాయులు సుదర్శన్ రావు, పాండురంగయ్య, ఈశ్వర్‌లాల్, రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

30న చలో కలెక్టరేట్ విజయవంతం చేయండి



సీఐటీయూ అనుబంధ కార్మిక సంఘాల ముఖ్య నాయకుల సమావేశంలో మాట్లాడుతున్న పాలడుగు భాస్కర్

వనపర్తిగ్రామీణం, న్యూస్‌టుడే : జిల్లాలో ఒప్పంద, పొరుగు సేవల తదితర శాఖల కార్మికులను శాశ్వత ఉద్యోగులుగా గుర్తించాలని ఈ నెల 30న నిర్వహించనున్న చలో కలెక్టరేట్ ధర్నా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్ పిలుపునిచ్చారు. శనివారం సీఐటీయూ జిల్లా కార్యాలయంలో వివిధ శాఖల కార్మికుల ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. శాశ్వత ఉద్యోగులుగా గుర్తించే వరకు పోరాటం చేస్తామన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి పుట్ట ఆంజనేయులు, బొబ్బిలి నిక్సన్, సునీత, బుచ్చమ్మ, మదన్, తదితరులు పాల్గొన్నారు.

జిల్లా స్థాయి క్రీడలకు ఎంపిక



ఎంపికైన విద్యార్థులతో ఉపాధ్యాయులు

ఖిల్లాగణపురం, న్యూస్‌టుడే: వనపర్తి జిల్లాలో త్వరలో జరుగనున్న జిల్లా స్థాయి క్రీడా పోటీలకు విద్యార్థులను ఎంపిక చేసినట్లు డీవైఎస్‌వో సుధీర్‌కుమార్‌రెడ్డి, ఎంఈవో జయశంకర్‌లు తెలిపారు. శనివారం మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాలలో అండర్17, -14 విభాగంలో బాలబాలికల మండల స్థాయి కబడ్డీ, ఖోఖో, వాలీబాల్ పోటీలను నిర్వహించారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులను జిల్లా స్థాయికి ఎంపిక చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎస్‌జీఎఫ్ సురేందర్‌రెడ్డి, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుడు కాళీదాస్, పీడీలు తిరుపతి, శైని, పీఈటీలు దేవేందర్, తదితరులు పాల్గొన్నారు.

'పీడీఎస్‌యూ స్వర్ణోత్సవ సభ జయప్రదం చేయండి'



ఆత్మకూరు: గోడపత్రిక విడుదల చేస్తున్న విద్యార్థులు

అమరచింత, న్యూస్‌టుడే : హైదరాబాద్ ఉస్మానియా విశ్వవిద్యాలయంలో ఈ నెల 30న నిర్వహించనున్న పీడీఎస్‌యూ స్వర్ణోత్సవ సభను జయప్రదం చేయాలని మస్తీపూర్ జడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థులు గోడ పత్రిక విడుదల చేశారు. అక్టోబర్ 1న వివిధ రాష్ట్రాల విద్యార్థి నాయకులతో 'అలిండియా పీడీఎస్‌యూ' ఆర్గనైజింగ్ కమిటీ సమావేశం నిర్వహిస్తున్నట్లు చెప్పారు.

ఆత్మకూరు: ఆత్మకూరు ప్రభుత్వ డిగ్రీ, జూనియర్ కళాశాలల్లో శనివారం మధ్యాహ్నం పీడీఎస్‌యూ స్వర్ణోత్సవ సభ సన్నాహక సమావేశాలను నిర్వహించారు. పీడీఎస్‌యూ స్వర్ణోత్సవాలను పురస్కరించుకొని ఈ నెల 30న ఉస్మానియా విశ్వవిద్యాలయం ఠాగూర్ ఆడిటోరియంలో నిర్వహించ తలపెట్టిన సభను జయప్రదం చేయాల్సిందిగా సంఘం జిల్లా నాయకులు సంజయ్, మణికంఠ, అనిల్, జిలాని, నవీన్ పేర్కొన్నారు.

పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం

చిన్నంబావి: చిన్నారులకు తప్పనిసరిగా పౌష్టికాహారాన్ని అందించాలని తహసీల్దార్ ఇక్బాల్, ఎంపీడీవో రమణరావు అన్నారు. జాతీయ పోషణ మాసం సందర్భంగా మండలంలోని దగడపల్లిలో నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వం చిన్నారుల ఎదుగుదలకు సరైన ఆహారాన్ని అందిస్తోందన్నారు. ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఉప తహసీల్దార్ శ్రీనివాస్, ఎంపీవో రామస్వామి, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ ఆసియా పాల్గొన్నారు.

'పరిహారం అడిగితే రైతులపై కేసులా?'



ఐబీ ఏఈ వెంకటేశ్వర్లును నిలదీస్తున్న రైతులు, నాయకులు

ఖిల్లాగణపురం, న్యూస్‌టుడే: పరిహారం అడిగితే ముంపు రైతులపై కేసులు పెడతారా? అంటూ ఖిల్లాగణపురం మాజీ ఎంపీపీ కృష్ణానాయక్, భారాస మండల అధ్యక్షుడు కృష్ణయ్య. . ఐబీ ఏఈ వెంకటేశ్వర్లును నిలదీశారు. రైతులకు పరిహారం చెల్లించాకే గణపసముద్రం రిజర్వాయర్ పనులు చేయాలంటూ ఇటీవల రైతులు అడ్డుకున్న విషయం పాఠకులకు విధితమే. పనులు అడ్డుకున్న రైతులపై శనివారం ఏఈ ఠాణాలో ఫిర్యాదు చేశారు. ఎస్సై సురేశ్‌గౌడ్ రైతులను పిలిపించి అధికారులతో మాట్లాడుకోవాలని తెలపడంతో ఏఈపై వాగ్వాదానికి దిగారు. ఎమ్మెల్యే మేఘారెడ్డి ముంపు బాధితులకు రూ.20లక్షలు ఇస్తామని చెప్పి, అధికారంలోకి వచ్చాక మాట మారుస్తూ పనులు అడ్డుకుంటున్న రైతులపై కేసు పెట్టించడం ఏమిటని ఏఈని ప్రశ్నించారు. రైతులతో మాట్లాడేందుకు సోమవారం ఉన్నతాధికారులు వస్తారని వారితోనే మాట్లాడుకోవాలని ఏఈ అక్కడి నుంచి వెళ్లిపోయారు. గణప సముద్రం ముంపు రైతులకు పరిహారం ఇచ్చాకే పనులు చేపట్టాలని లేకుంటే కలెక్టరేట్ ఎదుట ధర్నా చేపడతామని కృష్ణానాయక్ ప్రభుత్వాన్ని హెచ్చరించారు.